కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, మే 25: తడిసిన వరి ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చెల్పూర్, గొల్లపల్లి, బస్వరాజుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని సెంటర్లకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్టు యజమానులకు సూచించారు. మిల్లర్లు సన్న వడ్లను దింపుకునేలా అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. హనుమకొండ, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని మిల్లర్లు భూపాలపల్లి జిల్లా నుంచి వచ్చే వడ్లను దిగుమతి చేసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్లను ఫోన్ ద్వారా కోరారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

డీసీఎం బోల్తా పడటంతో చనిపోయిన పశువులు

పశువులను తరలిస్తున్న డీసీఎం బోల్తా

ఎనిమిది పశువులు మృతి

వెంకటాపురం(నూగూరు), మే 25 : పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని రాచపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై కొప్పుల తిరుపతిరావు కథనం ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి 14పశువులను డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా శనివారం రాత్రి మండల పరిధిలోని చారప్లిల గ్రామం మీదుగా ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అయితే, గ్రామ సమీపంలో వ్యాన్‌పల్టీ కొట్టడంతో వ్యాన్‌లో ఉన్న ఎనిమిది పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. మిగిలిన ఆరు పశువులను స్వాధీనం చేసుకొని భూపాలపల్లి గోశాలకు తరలించారు. పశువులను తరలిస్తున్న అర్జున్, బాలకృష్ణ, మహ్మద్‌గౌస్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, డీసీఎం వ్యాన్‌లో పశువుల కాళ్లను కట్టి వేయడం వల్ల అవి చెల్లాచెదురై మృతిచెందడం పలువురిని కలిచి వేసింది.

ఆత్మహత్య నివారణ కరపత్రాల ఆవిష్కరణ

ములుగురూరల్, మే 25 : ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన కరపత్రాలను ములుగు డీఎస్పీ ఎన్ రవీందర్ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని డీఎస్పీ సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని కమిటీ సభ్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, బీసీ జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతి, బ్రహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం మోహన్‌కుమార్, చిందం మొగిలి, అబ్దుల్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రవీందర్

చెంచుకాలనీ వాసులకు రెడ్ క్రాస్ చేయూత

ములుగురూరల్, మే 25 : మండలంలోని దేవగిరిపట్నం చెంచు కాలనీ వాసులకు ములుగు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దస్తులు, దుప్పట్లు, వంట గిన్నెలను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా సొసైటీ చైర్మన్, హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య హాజరై మాట్లాడుతూ పేదలకు చేయూత అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రమేశ్, సభ్యులు సానికొమ్ము రవీందర్‌రెడ్డి, కొండి సాంబశివ, ములుగు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్లు, సామగ్రి అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ బృందం

జంగాలపల్లి క్రాస్ వద్ద రామప్ప థీమ్

- మూడు ఐలాండ్లలో విగ్రహాల ఏర్పాటుకు చర్యలు
- ప్రారంభమైన నిర్మాణ పనులు


జంగాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్మించనున్న రామప్ప కళ వైభవ ఉహా చిత్రాలు

ములుగు, మే 25 (నమస్తే తెలంగాణ) : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రోజు రోజుకు భక్తులు, పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. అందుకు అనుగుణంగా విస్తృత ప్రచారం కల్పించేలా, రామప్ప రూట్‌ను తెలియజేసేలా ములుగు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగా జాతీయ రహదారి 163 మీదుగా రామప్పకు వెళ్లే క్రమంలో ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మూడు ట్రాఫిక్ ఐలాండ్‌లలో రామప్ప దేవాలయ విశిష్టత తెలియజేసే విధంగా మూడు థీమ్‌లను ఏర్పాటు చేస్తుండగా ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఒక ఐలాండ్‌లో భక్తులకు స్వాగతం పలికేలా ఏనుగు విగ్రహాలతో పాటు నంది విగ్రహాన్ని, మరో దానిలో రామప్ప గుడిలోని శిలా శాసన మందిరాన్ని పోలిన నిర్మాణంతో పాటు చుట్టూ నాట్య భంగిమల విగ్రహాలు, ఇంకో దానిలో చేతిలో డమరుకంతో పాటు రెండు వైపులా నంది విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. త్వరలో ఈ పనులు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ఆధ్యాత్మికత పంచు తూ రూట్ మ్యాప్‌లా మారనుంది.

పెరిగిన గోదావరి నీటిమట్టం

కన్నాయిగూడెం, మే 25 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటి మట్టం ఆదివారం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి గోదావరిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో బరాజ్ వద్ద నీటి మట్టం 75.90 మీటర్లకు చేరుకుంది. ఎగువ నుంచి 4250 క్యూసెక్కుల వరద వస్తుండగా ఒక గేటు పైకి ఎత్తి 2400 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

టీఎంవోఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీశ్‌కుమార్

ములుగురూరల్, మే 25 : తెలంగాణ మీ సేవా ఆపరేటర్స్ అసోసియేషన్(టీఎంవోఏ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కొమురవెల్లి సతీశ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం సతీశ్‌కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు భక్తుల జీవన్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ కొత్త కిరణ్‌కుమార్ సన్మానించారు. ములుగు జిల్లా అధ్యక్షుడిగా సతీశ్ అందించిన సేవలను గుర్తించి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేర్గు నగేశ్, రంజిత్, సంపత్, కుమార్, రాజు పాల్గొన్నారు.

ఎరుకల ప్రజా సమితి భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేతిరి రవి

నియామక పత్రం అందజేస్తున్న కెమసారం తిరుపతి

భూపాలపల్లి రూరల్, మే 25 : తెలంగాణ ఎరుకల ప్రజాసమితి భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేతిరి రవి, ఉపాధ్యక్షుడిగా కుర్ర భాస్కర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉండాడి వెంకటేశ్, దుగ్యాల స్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు కేతిరి సారయ్య, అధ్యక్షుడు కెమసారం రాజు, ప్రధాన కార్యదర్శి రెవెల్లి సతీశ్, పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మానుపాటి జయశంకర్, కరీంనగర్ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి బిజిలి శ్రీను, రెవెల్లి కిరణ్ పాల్గొన్నారు.

సకాలంలో బ్రిడ్జి పూర్తి కావాలని పూజలు

ఏటూరునాగారం, మే 25 : కొండాయి వాగుపై నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి సకాలంలో పూర్తి కావాలని కొండాయి, మల్యాల గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద మీనయ్య మాట్లాడుతూ ఇక్కడి జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా పూర్తికావడానికి గ్రామస్తులంతా సహకరిస్తున్నామన్నారు. సమ్మక్కసారలమ్మ దయతో వంతెన నాణ్యతా ప్రమాణాలతో పూర్తయి ప్రజల కష్టాలు తీరాలని ఆకాంక్షించారు. అనంతరం డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు.

పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

కాటారంలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షణ

కాటారం, మే 25 : కాటారం మండల కేంద్రం గారెపల్లి ప్రధాన చౌరస్తా వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కాళేశ్వరం పుష్కరాలకు భక్తులతో వెళ్లిన ఆర్టీసీ బస్సులు మార్గమధ్యంలో గంటల పాటు నిలిచిపోవడంతో మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన సామాన్య ప్రయాణికులు కాటారంలో ప్రత్యామ్నాయ దారి లేక గమ్యస్థానాలకు వెళ్లలేక నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అటు పెద్దపల్లి జిల్లా మంథని, ఇటు భూపాలపల్లి జిల్లా రూట్లలో ఆదివారం బస్సులు తక్కువ సంఖ్యలో తిరగడంతో కాటారంలో ప్రయాణికులకు పడిగాపులు తప్పలేదు. సాధారణ ప్రయాణికులకు సరిపడా బస్సులు వేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడినట్లు వారు ఆందోళన వ్యక్తం చేశారు.

పాఠశాల స్థల దాతకు నివాళి

మంగపేట, మే 25 : మండలంలోని కమలాపురం ప్రభుత్వ పాఠశాల స్థలం, భవన దాత చింతా నర్సయ్య వర్ధంతిని పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ ఇప్పలపెల్లి రమేశ్, హెచ్ఎం గడ్డి శ్రీనివాస్ పాఠశాల కోసం మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఎంతో విలువైన స్థలాన్ని దానం చేసిన నర్సయ్య ఔదర్యాన్ని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సిద్ధంశెట్టి రామగోవిందం, లక్ష్మీ నర్సయ్య, పీఈటీ హుణ్యా, చింతా నర్సయ్య వారసులు సంపూర్ణ, సాంబశివరావు, పోలసాని శ్రీనివాస్‌రెడ్డి, బూర లక్ష్మీనారాయణ, కుమారస్వామి, ఖుర్బన్ అలీ, చింత సాంబయ్య పాల్గొన్నారు.

చింతా నర్సయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు

సివిల్ జీఎం సూర్యనారాయణకు సన్మానం

సూర్యనారాయణకు బొకే అందజేస్తున్న సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్, మే 25 : సింగరేణి సంస్థకు సివిల్ జీఎం టీ సూర్యనారాయణ 36 ఏళ్ల పాటు సేవలందించడం అభినందనీయమని భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ నెల పదవి విరమణ చేస్తున్న టీ సూర్యనారాయణకు ఆదివారం భూపాలపల్లి సింగరేణి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శాలువా కప్పి, పూలబొకే ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేటీకే వన్ గ్రూప్ ఏజెంట్ వెంకటరమణ, ఏజీఎం ఐఈడీ జోతి, ఏజీఎం సివిల్ నాగేశ్వరరావు, డీజీఎం(సివిల్) రవికుమార్, ఎస్ఈ బాలరాజు, భూపాలపల్లి ఏరియా గణపూర్ ఏరియా కాంట్రాక్టర్స్ పాల్గొన్నారు.

పర్యాటకుల సండే సందడి

వాజేడు/వెంకటాపూర్, మే 25 : వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయగార బొగత జలపాతాన్ని చూసేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం పైనుండి జాలువారుతున్న నీటి ధారలను చూస్తూ సంతోషంగా గడిపారు. పర్యాటకుల కేరింతలతో జలపాతం పరిసరాల్లో సందడి నెలకొంది. అలాగే, వెంకటాపూర్ మండలంలోని పాలంపేట రామప్ప దేవాలయం కాళేశ్వరం పుష్కరాల భక్తులతో కోలాహలంగా మారింది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయాన్ని 20 వేల మంది పర్యాటకులు సందర్శించారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థప్రసాదాలు అందజేశారు. పర్యాటకులు ఆలయ చరిత్రను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి, బోటింగ్ చేశారు.

వెంకటాపూర్ : దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వాజేడు : బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి

కుంటలో మునిగి ఒకరి మృతి

వెంకటాపూర్, మే 25 : ప్రమాదవశాత్తు నీటి కుంటలో మునిగి ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై జక్కుల శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన నాయిని శ్రీకాంత్(27) శనివారం సాయంత్రం ఊరి చివరిలోని శివునికుంటలో ఈతకు దిగాడు. లోతు ఎక్కువ ఉండడంతో మునిగిపోయాడు. ఆదివారం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గణపురం : తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పోరెడ్డి పూర్ణచందర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- పీఏసీఎస్ మాజీ చైర్మన్ పూర్ణచందర్‌రెడ్డి
- తడిసిన ధాన్యం పరిశీలన

గణపురం, మే 25 : ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్, పీసీసీ ఇన్‌చార్జి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందన్నారు. గత ప్రభుత్వంలో కటింగ్‌లపై మాట్లాడిన ప్రస్తుత ఎమ్మెల్యే ఇప్పుడు ఎవరితో కుమ్మక్కయ్యారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం గోదాముల్లో ధాన్యం నిల్వ చేయాలని కోరారు.

కాటారం : తడిసిన ధాన్యంను చూపుతున్న బీఎస్పీ నాయకులు

తడిచిన ప్రతి గింజను తక్షణమే కొనాలి

కాటారం : అకాల వర్షాలకు తడిచిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని దేవరాంపల్లి, రేగులగూడెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మంథని నియోజక వర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్, అధ్యక్షుడు బొడ్డు రాజబాబు పరిశీలించారు. ఐకేపీ కేంద్రాల్లో యాసంగి వడ్లు పోసి దాదాపు 25రోజులు గడుస్తున్నా కాంటా పెట్టకపోవడంతో వర్షాలకు తడిసి కొట్టుకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు వరి ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోళ్లు జరిపితే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమై తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పుష్కరాలకు వెళ్తూ..

ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని ఒకరి మృతి

ప్రమాదంలో ధ్వంసమైన కారు

కాటారం, మే 25 : సరస్వతీ పుష్కరాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం కాటారం శివారులో చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్, ట్రైనీ ఎస్సై గీతా రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన గెల్లి లక్ష్మీనర్సింహారావు కియా కారులో భార్య లక్ష్మీప్రసన్న, కుమార్తెలు ధనలక్ష్మి, నందిని, తేజస్వినితో పుష్కరాలకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. హైదరాబాద్ బాలాపూర్ క్రాస్ రోడ్డు త్రివేణినగర్‌కు చెందిన సకోటే కిషన్‌లాల్, కాడికె దుర్గాజీతో పాటు వారి కుటుంబసభ్యులు టవేరా వాహనంలో పుష్కర స్నానం కోసం కాళేశ్వరం వెళ్తున్నారు. కాటారం శివారులో కాళేశ్వరం నుంచి వస్తున్న కియా కారు ఎదురు గా వేగంగా వచ్చి టవేరా వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సకోటే లలిత(61) తీవ్ర గాయాలతో మృతి చెందింది. కిషన్‌లాల్, రాకేశ్, సాయినంద, కాడికే దుర్గాజీ, పద్మ, సాయిప్రియ, రేణుక, నర్మద, డ్రైవర్ మల్లేశ్ గాయ పడ్డారు. వీరిలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. టవేరా ముందు భాగం ధ్వంసం కావడంతో గాయపడ్డవారు బయటికి రాలేని పరిస్థితి తలెత్తింది. దీంతో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు ఆత్మకూరి కుమార్, భూపెల్లి రాజు, కొట్టె శ్రీశైలం, శ్రీహరి, అశోక్ తదితరులు, పోలీసులు, స్థానికులు జేసీబీ సాయంతో కారు ముందు భాగాన్ని విడగొట్టి క్షతగాత్రులను బయటకు తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారు. అదేవిధంగా కారులోని లక్ష్మీనర్సింహారావు, భార్యాపిల్లలు గాయపడగా భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాటారం ఎస్ఐ అభినవ్, ట్రైనీ ఎస్ఐ గీత రాథోడ్ ఘటనా స్థలికి చేరుకొని జేసీబీ సాయంతో వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇసుక లారీ బోల్తా

ఏటూరునాగారం, మే 25 : మండలంలోని హనుమాన్ నగర్ సమీపంలో ఆదివారం ఓ ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడింది. మంగపేట వైపు నుంచి వస్తున్న లారీ హైదరాబాద్‌కు లోడుతో వెళుతోంది. ఈ క్రమంలో హనుమాన్ నగర్ సమీపంలో లారీ రోడ్డు దిగి చెట్లలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. బోల్తా పడిన లారీ ఒక పక్క ధ్వంసమైంది.

మునీర్ మరణం తీరని లోటు

భూపాలపల్లి రూరల్, మే 25: సీనియర్ జర్నలిస్టు మునీర్ మరణం తెలంగాణకు తీరని లోటని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి మాజీ ఉద్యోగిగా, సీనియర్ జర్నలిస్టుగా, సకల జనుల సమ్మెలో సింగరేణి విభాగానికి కన్వీనర్‌గా, పలు సమాజహిత ఉద్యమాల్లో కీలకభూమిక పోషించారని అన్నారు. ఆయన అకాల మరణంపై తీవ్ర సంతాపం తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

టేకుమట్ల, మే 25 : మండలంలోని గర్మిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆర్సిరెడ్డిపల్లి అమ్మ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. స్నేహితులందరూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తిరుపతిరెడ్డి, లక్ష్మీ నరసయ్య, బాబురావు, మహేందర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రూ.30 వేల ఆర్థిక సాయం అందజేత

ములుగురూరల్, మే 25 : ములుగు ఎస్‌బీఐలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బరిగలానిపల్లి గ్రామానికి చెందిన మట్టెవాడ నరేశ్ ఇటీవల వెంకటాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌బీఐ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆదివారం రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, అర్బన్ అధ్యక్షుడు అహ్మద్, రూరల్ అధ్యక్షుడు దుగ్గి వీరన్న, ఉపాధ్యక్షుడు అంకూస్, నాంగునూరి రవి, ధర్మ, రాజీవ్, అశోక్, శ్రీను, కరీంనగర్ బ్రాంచ్ అధ్యక్షుడు పెద్దాపురం రాజు, అశోక్, కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షుడు కిశోర్, క్రాంతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ఇక్కట్లు

- తరచూ ట్రాఫిక్ జామ్
- పట్టింపులేని అధికారులు

మంగపేట-కమలాపురం ఇసుక లారీల వల్ల ఏర్పడ్డ ట్రాఫిక్ జామ్

మంగపేట, మే 25: ఇసుక లారీల వల్ల నిత్యం ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ఇసుక క్వారీల వద్దకు వచ్చే లారీలకు తోడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైపు నుంచి వస్తున్న వందలాది ఇసుక లారీలతో మండలంలోని కమలాపురం నుంచి రాజుపేట మధ్యలో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. కమలాపురం-మంగపేట మధ్య దొంగలొర్రె సమీపంలో ఆదివారం ఇసుక లారీలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు చాలా సేపు రోడ్డుపైనే నిలిచిపోయాయి. అత్యవసర పనులకు వెళ్లే వారు కూడా గమ్య స్థానాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇసుక క్వారీల వద్ద పార్కింగ్ స్థలాలు లేక పోవడంతో లోడ్ అయిన లారీలన్నీ నేరుగా మెయిన్ రోడ్డుపైకి వస్తున్నాయి. అవి నేరుగా హైదరాబాద్, హనుమకొండ తదితర ప్రాంతాల వైపు వెళుతున్నాయి. అయితే, లోడ్ అయిన లారీలు వేబ్రిడ్జిల వద్ద తూకం వేయించుకునేందుకు ఆగే క్రమంలో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. వేబ్రిడ్జిలు, క్వారీల సమీపంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడినప్పుడు లారీలను క్రమబద్ధీకరించే వారు లేకపోవడంతో సమస్య తీరడం లేదు. ఈ సమస్య నిత్యకృత్యంగా మారినా అధికారులు పట్టించుకోడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టి, ట్రాఫిక్ జామ్ సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మొగుళ్లపల్లి, మే 25 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్ఐ శివరామకృష్ణ తెలిపారు. నడికూడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌తో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో మండలంలోని వేములపల్లి గ్రామంలోని పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ సిబ్బంది దాడులు చేసినట్లు తెలిపారు. డ్రైవర్‌ను విచారించగా ట్రాక్టర్ వరికోల్ గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ సాంబశివరావుకు చెందినదని చెప్పాడు. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

వాడబలిజలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

మంగపేట : జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్

మంగపేట/వెంకటాపూరం(నూగూరు)/ఏటూరునాగారం, మే 25 : వాడబలిజలు ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకోవాలని ఆ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్ పిలుపునిచ్చారు. వాడబలిజ కుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగపేట మండలంలోని కత్తిగూడెంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ సంఘంలో సభ్యత్వాలు పొందాలని సూచించారు. అనంతరం మంగపేట మండల కేంద్రానికి చెందిన కలాల రాంబాబును సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గార ఆనంద్, గగ్గురి రమణయ్య, ముఖ్య సలహాదారులు తోట మల్లికార్జున్, మంగపేట, వాజేడు మండలాల అధ్యక్షులు గగ్గురి రాంప్రసాద్, బొల్లె ఆదినారాయణ, బద్ది రఘుబాబు పాల్గొన్నారు. అలాగే, వెంకటాపురం(నూగూరు) మండలంలోని వీఆర్కేపురం గ్రామం